బారులు తీరిన అర్జీదారులు

పనులు మానుకున్నారు. సోమవారం తెల్లారగానే అర్జీలు చేత పట్టుకున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలు.. ఈ సారైనా తీరకపోతాయా అన్న ఆశతో జిల్లా కేంద్రం బస్సెక్కారు. ఇలా నలమూలల నుంచి అర్జీదారులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వీరిలో అవ్వా తాత, అక్క చెల్లెలు, అన్న తమ్ముడు.. చంటి బిడ్డలతో తల్లులు ఉన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వీరు క్యూలో బారులు తీరారు. మొత్తం 209 మంది అర్జీలిచ్చారు. వీటిలో 189 రెవెన్యూ శాఖకు సంబంధించినవే. మండలస్థాయిలో పరిష్కారం కాకపోవడం.. అధికారులు పట్టించుకోకపోవడం వంటి కారణాలతో వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వస్తున్నారు. మరి, వీరిలో ఎందరి సమస్యలు పరిష్కారమవుతాయో..!



- చిత్తూరు

13 మందికి డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డులు

ప్రతిష్ఠాత్మకమైన డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డును ఎస్పీ మణికంఠ చేతుల మీదుగా 13 మంది పోలీసు ఉన్నతాధికారులు అందుకున్నారు. సోమవారం జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయంలో అవార్డుల ప్రదానం జరిగింది. 2021, 2022లో విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది పోలీసులకు డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఆనందంగా ఉందని ఎస్పీ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, కన్విక్షన్, బెస్ట్ పోలీసింగ్, పోక్సో చట్టం అమలు, శాంతి భద్రతల విభాగం, నేర పరిశోధనలో అందించిన అత్యుత్తమ సేవలకు డీజీపీ అవార్డు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్‌బాషా, ఇలియాస్ బాషా, ఎంటీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న పోలీసులతో ఎస్పీ

- చిత్తూరు

రెస్కో మాజీ చైర్మన్ అరెస్టు



కుప్పం పోలీసు స్టేషన్ వద్ద సెంథిల్ కుమార్

కుప్పం, సెప్టెంబరు 2: కుప్పం రెస్కో మాజీ చైర్మన్ జీఎస్ సెంథిల్ కుమార్‌ను సోమవారం అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. రెస్కో ఎండీ సోమశేఖర్ ఫిర్యాదు మేరకు ఈ అరెస్టు జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో సెంథిల్ కుమార్ రెస్కో చైర్మన్‌గా కొనసాగారు. ఆ సమయంలో రెస్కో ఎండీకి కేటాయించిన వాహనాన్ని సొంతానికి వినియోగించుకున్నారు. సాధారణంగా ఈ వాహనానికి వేల రూపాయల అలవెన్సు మంజూరు అవుతుంది. ఈ అలవెన్సును తీసుకోవడమే కాకుండా అదనంగా డీజీలు బిల్లులు పెట్టి, సుమారు రూ.28 లక్షలు రెస్కోనుంచి డ్రా చేశారు. అంటే నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. వాహనం పేరుతో చేసిన నిధుల దుర్వినియోగంపై రెస్కో ప్రస్తుత ఎండీ సోమశేఖర్, గత నెల చివరి వారంలో కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు నిందితుడైన రెస్కో మాజీ చైర్మన్ సెంథిల్‌పై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆయనకోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరిలో సెంథిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని సోమవారం కుప్పం తీసుకు వచ్చి అరెస్టు చేశారు. ఈయనపై 406, 409 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కోర్టు ముందు హాజరు పరచగా న్యాయమూర్తి 15 రోజులు రిమాండు విధించారు. దీంతో సెంథిల్‌కుమార్‌ను మదనపల్లె సబ్ జైలుకు పోలీసులు తరలించారు. దీనిపై కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడును వివరణ కోరగా రెస్కోలో వాహనం విషయంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదు మేరకు రెస్కో మాజీ చైర్మన్ సెంథిల్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.





మధుసూదన్ కుటుంబంపై దాడి చేస్తున్న మరో వర్గం - ఆందోళన చేపడుతున్న వారికి సర్దిచెబుతున్న పోలీసులు

క్రికెట్ బంతి తెచ్చిన తంటా

- వి.కోటలో ఉద్రిక్తత
- పర్వసర దాడులు.. దుకాణాల ధ్వంసం..
- అర్ధరాత్రి 12.30 గంటలు దాటాక ఆందోళన విరమణ





రెండోసారి జరిగిన దాడిలో గాయపడిన బాధితులు

వి.కోట, సెప్టెంబరు 2: వి.కోటలో క్రికెట్ బంతి సమీపంలోని ఒక మహిళకు తగిలిన సంఘటన పెద్ద వివాదంగా మారిపోయి ఘర్షణలకు దారితీసింది. ధర్నాలు దుకాణాలు, వాహనాలపై దాడులతో ఉద్రిక్తంగా మారింది. సోమవారం సాయంత్రం భర్త మధుసూదన్‌తో కలిసి బజారుకు వెళ్లి వస్తున్న జ్ఞానప్రసూనాంబకు క్రికెట్ బంతి తగిలింది. దీంతో వారు క్రికెట్ ఆడుతున్న యువకులను మందలించారు. మాటామాటా పెరిగి క్రికెట్ ఆడుతున్న యువకులు దంపతులపై దాడికి దిగారు. వీరు ఇంటికి పరుగు తీసి గడియ పెట్టుకున్నారు. యువకులు ఇంటి మీద దాడి చేశారు. చుట్టుపక్కల వారు అడ్డుకోవడంతో వారి మీదా కర్రలతో, రాడ్లతో దాడి చేశారు. గాయపడిన వారు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల తరపున పెద్ద సంఖ్యలో వారి బంధుగణం స్టేషన్ వద్దకు చేరుకుంది. ఈలోగా దాడి దృశ్యాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఓ వర్గం పై మరో వర్గం దాడి చేసిందని, దీనిని ప్రశ్నించేవారే లేరా అంటూ పిలుపునివ్వడంతో ఈ వివాదం మతం రంగు పులుముకుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిగా స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కేసు నమోదు చేస్తామని సీఐ హామీ ఇచ్చారు. ఇంతలో కొందరు యువకులు దాడి చేసిన వారున్న మసీదు వీధికి చేరుకున్నారు. గొడవ చేసిన వారిపై చర్యలు తీసుకుంటే తమకు అభ్యంతరం లేదని, అయితే మసీదు వద్ద నినాదాలు చేయడం సరికాదని అక్కడివారు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అంతలో కొందరు ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో పాపేపల్లెకు చెందిన బాలరాజు, మహేష్, వి.కోటకు చెందిన సురేష్, బీజేపీ నేత రామచంద్రుడుతో పాటు మరి కొందరు గాయపడ్డారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

జాతీయ రహదారిపై ధర్నా.. దాడులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పోలీసులు మెతక వైఖరితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బాధితులు, వారి బంధువులు అంబేడ్కర్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. గాయపరచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నినదించారు. దీంతో వాహనాల రాకపోకలు ఆగాయి. పోలీసులు ఎంత నచ్చజెప్పినా ధర్నా చేస్తున్న వారు వినక పోవడంతో పరిస్థితి విషమించింది. ఇదే అదునుగా కొందరు పలు దుకాణాలను ధ్వంసం చేశారు. మరి కొందరు ఆటోలు, ఇతర వాహనాల అద్దాలను పగుల గొట్టారు.



రాయి తగిలి డీఎస్పీకి తీవ్రగాయాలు

గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభించడంతో పలమనేరు ఆర్డీవో మనోజ్ కుమార్‌రెడ్డి వి.కోటకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో ఆందోళనకారులపైకి మరో వర్గం రాళ్ల రువ్వింది. దీంతో అక్కడ వేచి ఉన్న యువకులు వారి వైపు దూసుకెళ్లారు. దీంతో పోలీసులు అటువైపు వెళ్లకుండా వీరిని అడ్డుకున్నారు. అటువైపు నుంచి వచ్చిన రాయి పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తలకు తగలడంతో తీవ్ర రక్తస్రావంతో ఆయన ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి మరింత క్షీణించడంతో అదనపు బలగాలు వి.కోటకు చేరాయి. రాత్రి 10.45 గంటలప్పుడు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ వి.కోటకు చేరుకుని డీఎస్పీని పరామర్శించారు. ఆందోళనకారుల వద్దకెళ్లి సుదీర్ఘంగా చర్చించి.. వారిని ఒప్పించారు. దీంతో రాత్రి 12.30 గంటల సమయంలో ఆందోళన విరమించారు. వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.

నాటి పాలకవర్గం నుంచే 18శాతం వడ్డీతో రికవరీ చేయండి

- సీడీసీఎంఎస్‌లో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 2: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)లో దుర్వినియోగమైన నిధులను 18 శాతం వడ్డీతో రికవరీ చేయాలని కలెక్టరు సుమిత్‌కుమార్ ఆదేశించారు. దీనికి బాధ్యులైన అప్పటి పాలకవర్గం నుంచే వసూలు చేయాలన్నారు. వివరాలిలా ఉన్నాయి. సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్, ప్రస్తుత వైసీపీ నేత శ్యామరాజు గతంలో చైర్మన్‌గా వ్యవహరించారు. అప్పట్లో సొసైటీ పరిధిలో పాలకవర్గం అవకతవకలకు పాల్పడి నిధుల దుర్వినియోగం చేసిందని, వాటిపై విచారణ జరిపించాలని కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించాలని సహకార శాఖ అధికారులకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ ఆడిట్ రిపోర్టు ఆధారంగా రూ.12.85 లక్షల మేరకు సొసైటీ మాజీ చైర్మన్ అవినీతికి పాల్పడి, నిధులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. ఈయనతో పాటు ఇంకా అప్పటి పాలకవర్గ వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి రూ.56,900, సభ్యులు నాగరాజు రూ.53,974, తిమ్మప్ప రూ.63,170, శ్రీనివాసులు రూ.34.640, సుబ్బమ్మ రూ.58,890, శంకరప్ప రూ.20,360, సొసైటీ మాజీ బిజినెస్ మేనేజర్ వెంకటమునిరెడ్డి రూ.23 వేల వరకు నిధుల దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలింది. దుర్వినియోగమైన నిధులను 18 శాతం వడ్డీతో వారి నుంచే రికవరీ చేయాలని సహకార శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. సర్‌ఛార్జీనోటీసులు జారీ చేసి వారిపై ఎగ్జిక్యూటివ్ పిటిషన్ దాఖలు చేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

వారానికే చకచకా



నగరిలో ఆగస్టు 23న జరిగిన గ్రామసభ

- రూ.63 కోట్లతో 139 కి.మీ సీసీ రోడ్ల మంజూరు
- టెక్నికల్ శాంక్షన్, జియో ట్యాగింగ్ కూడా పూర్తి
- ఇక పనులు ప్రారంభించడమే తరువాయి
- సత్ఫలితాలిస్తున్న గ్రామసభలు

చిత్తూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్రాభివృద్ధి, స్వయం సమృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన గ్రామ సభలకు ఫలితం కనిపిస్తోంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పూర్తిగా విస్మరించిన ఈ గ్రామ సభల్ని కూటమి ప్రభుత్వం ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేసారి నిర్వహించిన విషయం తెలిసిందే. గ్రామస్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఎంపీడీవో, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులంతా సమావేశమై ఆయా గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతుల్ని గుర్తించారు. మంజూరుకు ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలంతా ఆయా నియోజకవర్గాల్లో జరిగిన గ్రామసభలకు హాజరయ్యారు.

జిల్లాలోని 700 పంచాయతీల్లో జరిగిన గ్రామసభల్లో రూ.91.30 కోట్లతో 1407 పనుల్ని గుర్తించారు. వీటిలో రూ.63 కోట్ల విలువైన సీసీ రోడ్లను ఇప్పటికే మంజూరు చేసేశారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే ఎస్టిమేట్స్, సాంకేతిక మంజూరు, జియో ట్యాగింగ్, ప్రతి పనికీ ఐడీ కేటాయింపు.. వంటి పనులన్నీ పూర్తయ్యాయి. సీసీ రోడ్లతో పాటు సీసీ డ్రెయిన్స్, పశువుల షెడ్లు వంటి పనుల్ని కూడా గుర్తించారు. సుమారు రూ.23 కోట్ల విలువ చేసే 207 ఈ పనుల్ని కూడా త్వరలో మంజూరు చేయనున్నారు. వచ్చే మార్చి నెలాఖరులోగా గ్రామ సభల్లో గుర్తించిన పనులన్నీ పూర్తి చేయాలనే ఉద్దేశంతో యంత్రాంగం ముందుకు పోతోంది. ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని ఇప్పటికే మంజూరైన సీసీ రోడ్ల పనుల్ని ప్రారంభించుకోవాల్సి ఉంది.

కుప్పానికి అగ్రతాంబూలం

సీఎం చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి అధికార యంత్రాంగం అన్ని విషయాల్లో ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే ఇక్కడ కేంద్రీయ విద్యాలయ మంజూరు చేయగా, స్థల పరిశీలన పూర్తయింది. మిగులు భూముల సమస్యను పూర్తిగా పరిష్కరించారు. ప్రతి గురువారం స్వయంగా కలెక్టర్ హాజరై గ్రీవెన్స్ డే నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నారు. తాజాగా 50 ఏళ్ల పైబడి కంటి చూపు సమస్యతో బాధ పడుతున్న సుమారు 5700 మందిని మెగా క్యాంపు నిర్వహించి గుర్తించారు. వీరిలో 4 వేల మందికి ఈ నెలాఖరులోగా అద్దాల పంపిణీ పూర్తి చేయనున్నారు. సుమారు 700 మందికి మూడు నెలల్లో సర్జరీ చేయనున్నారు. ఈ క్రమంలోనే సీసీ రోడ్ల మంజూరు విషయంలోనూ కుప్పానికే అధికారులు ప్రాధాన్యతనిచ్చినట్లు తెలుస్తోంది. మిగిలిన నియోజకవర్గాల కంటే ఎక్కువగా 223 పనుల్ని రూ.15.43 కోట్లతో మంజూరు చేశారు. ఆ తర్వాత స్థానంలో పూతలపట్టు ఉండగా.. చివరి స్థానంలో నగరి ఉంది.

నియోజకవర్గాల వారీగా మంజూరైన సీసీ రోడ్ల వివరాలు

నియోజకవర్గం	మంజూరైన పనులు	పొడవు (కి.మీ.లో)	అంచనా వ్యయం (రూ.కోట్లలో..)
కుప్పం	223	20.2	రూ.15.43
పూతలపట్టు	206	25.1	రూ.10.06
చిత్తూరు	160	21.4	రూ.9.96
జీడీనెల్లూరు	199	26.7	రూ.9.10
పలమనేరు	162	18.4	రూ.7.57
పుంగనూరు	158	18.5	రూ.7.42
నగరి (3 మండలాలు)	92	8.9	రూ.3.57
మొత్తం	1200	139.3	రూ.63.13

పది మండలాల్లో 30 పోలీసు యాక్ట్

పలమనేరు, సెప్టెంబరు 2: పలమనేరు సబ్ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో ఈ నెలాఖరు వరకు 30 పోలీసు యాక్టు అమలు చేస్తున్నట్లు డీఎస్పీ ప్రభాకర్ సోమవారం తెలిపారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న కొన్ని సంఘటనలు దృష్టిలో పెట్టుకొని శాంతి భద్రతల దృష్ట్యా ముందు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టామన్నారు. పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి, బంగారుపాళ్యం, పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, వి.కోట మండలాల పరిధిలో 30 పోలీసు యాక్టు అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, మైక్‌సెట్ వినియోగించకూడదని పేర్కొన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరన్నారు.

ఆయాలు, నైట్ వాచ్‌మెన్ల జీతాలకు నిధులు విడుదల

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల జీతాలు, క్లీనింగ్ సామగ్రి కోసం నిధులు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. రూ.64.38 కోట్లు జీతాల కోసం, రూ.23.52 కోట్లు సామగ్రి కోసం విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

టేకాఫ్ సమయంలో ఆగిన విమానం

డోర్ వద్ద స్విచ్‌ని ఓ ప్రయాణికుడు తాకడమే కారణం

తిరుపతి విమానాశ్రయంలో ఘటన

ఏర్పేడు, సెప్టెంబరు 2: తిరుపతి విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం బయల్దేరిన ఓ విమానం టేకాఫ్ సమయంలో అందులోని ప్రయాణికుడి వల్ల ఆగిపోయింది. డోర్ వద్ద స్విచ్‌ను ఆ ప్రయాణికుడు తాకడంతో అది తెరుచుకుని విమానం టేకాఫ్ కాకుండా ఆగిపోయింది. దాంతో ఆ విమానంలోని ప్రయాణికులను విమానాశ్రయ అధికారులు మరో విమానంలో ఎక్కించి పంపారు. స్విచ్‌ని తాకిన ప్రయాణికుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి విమానాశ్రయ అధికారులు సిద్ధమయ్యారు. ఆ ప్రయాణికుడిని ఏర్పేడు పోలీసులకు అప్పగించారు. అయితే దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

ఐసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఐసెట్ రెండో దశ కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 9 నుంచి 14వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఉందని పేర్కొంది. 17న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 17 నుంచి 21లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించింది.

కొయ్యబొమ్మల కాణాచి మాధవమాల

90 ఏళ్లుగా జీవనాధారం చేసుకున్న కళాకారులు

జీఐ గుర్తింపునకు నేడు గ్రామానికి రానున్న అధ్యయన బృందం



పల్లెల్లో కోడికూతతో నిద్ర లేవడం సర్వసాధారణం. తిరుపతి-శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డుకు సమీపంలోని మాధవమాలలో మాత్రం ఉలి చప్పుళ్లతో గ్రామస్తులు నిద్ర లేస్తారు. ఈ గ్రామంలో ఇంటింటా కళాకారులు దర్శనమిస్తారు. కొయ్యబొమ్మలపై ఈ గ్రామస్తులు చెక్కే అద్భుత కళాఖండాలు ఎవరినైనా ఆకట్టుకుంటాయి. గ్రామాన్ని కొంతకాలం కింద బెల్జియం దేశస్తులు సందర్శించడంతో మాధవమాల అంతర్జాతీయంగా ఖ్యాతి గడించింది.

- ఏర్పేడు

ఏర్పేడు మండలం మాధవమాలలో 90 ఏళ్లుగా కొయ్యబొమ్మలను తయారు చేయడమే వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు ఇక్కడి కళాకారులు. గతంలో కృష్ణయ్య ఆచారి, చిన్నయ్యఆచారి, దొరస్వామి ఆచారి, మునెయ్య ఆచారి తదితరులు గ్రామంలోని రైతులకు కొయ్యనాగళ్లు, గడ్డమానులు, పారలు, తొళికలకు కత్తులు తయారు చేసి ఇచ్చేవారు. అలాగే గ్రామపరిసరాల్లో దొరికే కొయ్యతో చిన్నచిన్న బొమ్మలు తయారు చేసేవారు. వీరి బాటలోనే వారి వారసులు ఇదే వృత్తిని ఎంచుకున్నారు. దానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఆలయాలపై ఉన్న దేవతా మూర్తులు, ధ్వజస్తంభాలు, వినాయకుడు, శ్రీవేంకటేశ్వరస్వామి, అష్టలక్ష్మి, ధనలక్ష్మి, బుద్ధుడు, ఆంజనేయులు, మహావిష్ణువు, శ్రీకృష్ణుడు, పూర్ణకుంభం వంటి కొయ్యబొమ్మలకు మరింత వన్నె తెస్తున్నారు.

2013లో సంక్షేమ సంఘం

మాధవమాలలో బాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీ పేరిట 2013లో కళాకారులు ఓ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా లోకనాథం ఆచారి, కార్యదర్శిగా రాజాచారి, చీఫ్ ప్రమోటర్‌గా కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. ఈ గ్రామంతో పాటు గోపాలపురం, పాతవీరాపురం, గుండ్రాళ్లమిట్ట, ఇసుకతాగేలి, అంజిమేడు, కృష్ణంపల్లి గ్రామాలు రేణిగుంట, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, బుచ్చినాయుడుకండ్రిగ మండలాలకు చెందిన 360మందికిపైగా కళాకారులకు కూడా ఈ సంస్థలో సభ్యత్వం ఇచ్చారు. డీఆర్‌డీఏ, నాబార్డు సహకారంతో కళాకారులను గ్రూపులుగా విభజించారు. మాధవమాలలో ఓ పెద్ద భవనాన్ని నిర్మించి అక్కడే కార్మికులకు పని కల్పించారు.

దేశ, విదేశాల్లో ఖ్యాతి : ఆలయాల ధ్వజస్తంభాలు, రథాలు, ప్రధాన ద్వారాలతోపాటు అడుగు నుంచి 15 అడుగుల వరకు దేవతామూర్తుల బొమ్మలను తయారు చేస్తారు. ఈ బొమ్మలను తమ సంస్థ ద్వారా జైపూర్, ముంబై, కోల్‌కతా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో జరిగే ఎగ్జిబిషన్లకు పంపుతారు. అక్కడ నుంచి చైనా, జపాన్, లండన్, అమెరికా వంటి దేశాలకు ఎగుమతి చేస్తారు. దీంతో దేశ, విదేశాల్లో ఈ సంస్థ ఖ్యాతిని గడించడంతో గత ప్రభుత్వంలో 2021 సెప్టెంబరుకు శ్రీబాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీకి అప్పటి ప్రభుత్వం వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించింది.



వినాయకుడి బొమ్మ



వెంకటేశ్వరస్వామి బొమ్మలు



బొమ్మలు చెక్కుతున్న కళాకారులు

'చెక్క'ని కళాకృతులకు చక్కని గుర్తింపు



మాధవమాలతో పెనవేసుకున్న కళా నైపుణ్యానికి భౌగోళిక గుర్తింపు (జియోలాజికల్ ఐడెంటిటీ) నిచ్చేందుకు మంగళవారం తొలి అడుగులు పడుతున్నాయి. జీఐగా బ్రాండింగ్ పొందడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు నిపుణులు రానున్నారు. రిసెల్యూట్ సంస్థకు చెందిన శుభాజిత్ సాహో, శ్రీవత్స మంగరాటిలు నిశిత అధ్యయనానికి వస్తున్నారు. జీఐ గుర్తింపు దరఖాస్తుకు వీరు సేకరించి.. సమర్పించే సమాచారం కీలక భూమిక కానుండటం విశేషం. దీంతో వీరి పరిశీలనకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది.

సారూ.. సమస్యలు పరిష్కరిస్తారా!



అర్జీపై సంబంధిత అధికారికి ఫోన్‌లో ఆదేశం ఇస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబరు 2: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. బాధితుల సమస్యలను విని పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొత్తం 209 మంది వివిధ సమస్యలపై అర్జీలిచ్చారు. వీటిలో రెవెన్యూశాఖకు 189, మున్సిపాలిటీలకు 3, వ్యవసాయశాఖకు 2, డీఆర్‌డీఏ, వీకోట, పలమనేరు ఎంపీడీవో 2, ఆర్టీసీ, పశు సంవర్ధకశాఖ, తదితర శాఖలకు 13 అర్జీలు ఉన్నాయి. అధికారులకు అందిన సమస్యల్లో కొన్ని..

- తవణంపల్లె మండలం విజయనగరం యానాది కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని పలువురు గిరిజనులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 10 గృహాలకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయన్నారు. కాలనీలో తాగునీటి ట్యాంకు లేకపోవడంతో నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. కూలి పనుల కోసం వెళ్లేవారు కరెంటు వచ్చినప్పుడు నీళ్లను తెచ్చుకోవడానికి ఇబ్బందిగా ఉందన్నారు. కాలనీలో చాలా మందికి ఆధార్‌కార్డులు లేకపోవడంతో పాఠశాలలకు వెళ్లడం లేదన్నారు. అలాగే వీధి దీపాలు, అంగన్‌వాడీ కేంద్ర భవనం లేదన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.
- వ్యవసాయ భూములకు వెళ్లేదారిని భూస్వాములు ఆక్రమించారని చిత్తూరు మండలం ఎల్‌బీపురం ప్రాంతానికి చెందిన రైతులు వాపోయారు. సర్వే నెంబరు 216, 217లో ఉన్న దారిని ఆక్రమించి రాతి కూసాలు నాటి మూసివేశారని ఆరోపించారు. అధికారులు స్పందించి దారి సమస్యను పరిష్కరించాలని కోరారు.
- శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని తవణంపల్లె మండలం కృష్ణాపురంఎస్టీ కాలనీవాసులు కోరారు. శ్మశానభూములు ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మించాలని, అలాగే బోరును డ్రిల్లింగ్ వేయాలన్నారు.

పోలీసు శాఖకు 51 ఫిర్యాదులు

ప్రజా ఫిర్యాదులపై అలసత్వం చూపకూడదని, ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠ అన్నారు. సోమవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 51 మంది అర్జీదారులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటా ఎస్పీ బాధితులకు హామీ ఇచ్చారు. సోమవారం నాటి కార్యక్రమంలో భూ తగాదాలు 14, ఆస్తి తగాదాలు 11, కుటుంబ తగాదాలు 10, డబ్బు తగాదాలు 5, వేధింపులు 5, చీటింగ్ 3, దారి సమస్యలు 2, మిస్సింగ్ కేసు 1 చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సాయినాధ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

డీఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 2: బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందంటూ డీఈవో దేవరాజుపై కలెక్టర్ సుమిత్ కుమార్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో మూడు రోజుల్లో బిల్లు క్లియర్ చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఈవోను కలెక్టరు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే... ఈ ఏడాది ఫిబ్రవరిలో యాదమరి మండల పరిధిలోని పీఈఎస్ పబ్లిక్ స్కూల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. విద్యార్థులు, వారి గైడ్స్ సాయంతో 400 ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో వచ్చిన వారికి భోజన ఏర్పాట్ల కోసం చిత్తూరులోని గజేంద్ర క్యాటరింగ్ వారికి రూ.3.68 లక్షలకు అప్పగిస్తూ, రూ.లక్ష అడ్వాన్స్‌గా ఇచ్చారు. మిగిలిన మొత్తం రూ.2.68 లక్షలు చెల్లించాలని కోరుతూ క్యాటరింగ్ నిర్వహకుడు గత ఏడు నెలల కాలంగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరిగినా, ప్రయోజనం లేకపోవడంతో బాధితుడు కలెక్టర్‌ను ఆశ్రయించాడు. బిల్లు చెల్లించాలని కలెక్టర్ పలుమార్లు సూచించినా ఫలితం కనిపించలేదు. దీంతో బాధితుడు సోమవారం మరోసారి కలెక్టర్‌ను ఆశ్రయించి తన బాధను వివరించారు. అప్పులు తెచ్చి భోజనం పెట్టానని, నెలల గడవడంతో ఆర్థిక ఇబ్బందిని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దీతో మూడురోజుల్లో బిల్లు మొత్తం క్లియర్ చేయాలని డీఈవో దేవరాజుకు కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 2: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆర్థికపరమైన అంశాలపై అవగాహన, ఆన్‌లైన్ క్విజ్ మూడు దశల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎల్‌డీఎం హరీష్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. జాతీయ, జోనల్, రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు ఉంటాయని తెలిపారు. విజేతలకు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.10 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8 లక్షలు, తృతీయ బహుమతి రూ.6 లక్షలు ఇస్తారని వెల్లడించారు. 1999 సెప్టెంబరు ఒకటి నాటికి జన్మించి 25 సంవత్సరాలోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9490690274ను సంప్రదించాలని తెలిపారు.

మున్సిపల్ ఛైర్మన్ యూటర్న్

- నాడు వైసీపీకి రాజీనామా చేసి.. నేడు మళ్లీ ఆ పార్టీలోనే ఉంటామన్న అలాంబాషా
- తిరుపతిలో ఎంపీ మిథున్‌ను కలిసిన పుంగనూరు నేతలు



తిరుపతిలో ఎంపీ మిథున్‌తో మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్ అమ్ము



రొంపిచెర్లలో చల్లాబాబు ఇంటి వద్ద రాజీనామా చేసిన పుంగనూరు వైసీపీ కౌన్సిలర్లు (ఫైల్)

పుంగనూరు, సెప్టెంబరు 2: 'మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పదవులిచ్చి పవర్ లాగేసుకున్నారు' అని ఆరోపిస్తూ జూన్ 27వ తేది వైసీపీకి రాజీనామా చేసి త్వరలో టీడీపీలో చేరతామన్న పుంగనూరు మున్సిపల్ చైర్మన్ ఎస్.అలీంబాషా యూటర్న్ తీసుకున్నారు. రెండు నెలల తర్వాత.. వైసీపీలోనే ఉంటామని చెప్పారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్వగృహంలో వైసీపీ నేతలతో కలిసి ఛైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్ అమ్ము (రహంతుల్లా) ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. రొంపిచెర్లలోని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి వైసీపీకి చెందిన ఛైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్లు రహంతుల్లా, ఎం.రామకృష్ణమరాజు, జె.నరసింహులు, యువకుమారి, మమత, వి.కళిదాసు మొదలియార్, ఖాన్‌నూర్జహాన్, కసురున్నీషా, మనోహర్, రేష్మ రెండు నెలల కిందట వెళ్లారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పుంగనూరు అభివృద్ధి, మంత్రి నారా లోకేశ్ యువతకు మంచి ప్రాధాన్యం ఇవ్వడం, చంద్రబాబు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై తాము చల్లా బాబు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబును కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు నాడు వెల్లడించారు. ఇంతకాలం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వారి కుటుంబం తమకు పదవులు ఇచ్చినా అభివృద్ధి చేయడానికి అధికారం ఇవ్వకుండా రబ్బరు స్టాంపులుగా వాడుకున్నారని అలీంబాషా, అమ్ము ఆరోపించారు. తాజాగా సోమవారం వీరిద్దరూ తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ.. రెండు నెలలక్రితం వివిధ కారణాలతో వైసీపీకి రాజీనామా చేసినా తాము ఏపార్టీలో చేరలేదన్నారు. ఇకపై జీవితాంతం వైసీపీలో పెద్దిరెడ్డి కుటుంబం వెంటే ఉంటామన్నారు. వీరితో పాటు కౌన్సిలర్ రేష్మ పాల్గొన్నారు.

హైవోల్టేజ్‌తో గృహోపకరణాల దగ్ధం

ధర్నాకు దిగిన చెంగనపల్లె వాసులు



చెంగనపల్లెలో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

ఐరాల, సెప్టెంబరు 2: హైవోల్టేజ్ కారణంగా మండలంలోని చెంగనపల్లెలో సోమవారం పలు ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గ్రామస్తులు ధర్నాకు దిగారు. వారి వివరాల మేరకు.. గ్రామంలో ఆరునెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మార్చారు. ఆదివారం ఉదయం హై ఓల్టేజ్ కారణంగా పేలిపోయింది. సర్పంచ్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేసి సింగిల్ ఫేస్ కరెంటు విడుదల చేశారు. హైవోల్టేజ్ రావడంతో 70ఇళ్లలో 20 టీవీలు, 15 ఫ్రిడ్జ్‌లు, 5ల్యాప్‌టాప్‌లు, వాషింగ్ మిషన్లు, ఏసీలు కాలిపోయాయి. రూ.10లక్షల మేర నష్టం వాటిల్లింది. ఆగ్రహానికి గురైన మహిళలు రోడ్డుపై ధర్నాకు దిగారు. ఏఈ వచ్చి సమాధానం చెప్పాలని భీష్మించుకుని కూర్చున్నారు. ఐరాల ఎస్ఐ నరసింహులు చేరుకుని ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో శాంతించారు.

క్వారీ పనులు ఆపేయాలి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 2: మండలంలోని గడ్డూరుగ్రామ సమీపంలో నిర్వహిస్తున్న క్వారీలో పేలుళ్ల కారణంగా తమకు ఇబ్బందికరంగా ఉందని అందువల్ల క్వారీలో పనులు ఆపేయాలని గడ్డూరు గ్రామస్తులు కోరారు. సోమవారం గ్రామస్తులు క్వారీవద్దకు వెళ్లి పనులు వెంటనే ఆపేయాలని క్వారీ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు స్పందించి గ్రామసమీపంలో క్వారీ ఉండడం వల్ల కలుగుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



క్వారీ వద్ద గుమికూడిన గడ్డూరు గ్రామస్తులు

దళిత కుటుంబానికి న్యాయం చేయాలి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 2: దళితుల చెందిన భూమి ఆక్రమణను అడ్డుకుని న్యాయం చేయాలని జాతీయ మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు మునిరత్నం, పార్థసారథి కోరారు. బైరెడ్డిపల్లె మండలంలోని కమ్మనపల్లె గ్రామం వద్ద దళితుడైన తిరువలప్పకు చెందిన భూమిని కొందరు అగ్రకులస్తులు ఆక్రమించుకుంటున్నా రెవిన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని జాతీయ మానవహక్కులు, అవినీతి నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బైరెడ్డిపల్లె రెవిన్యూ కార్యాలయం ఎదుట బాధితులతో కలసి సంఘ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన భూమిలో తిరువలప్ప వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. కొందరు అగ్ర కులస్తులు ఆ భూమిని ఎలాగైనా కాజేయాలనే చూస్తున్నారని పేర్కొన్నారు. ఆక్రమణను అడ్డుకుని తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ మాధవరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు న్యాయం చేస్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

మినీ టెంపో ఢీకొని టమోటా రైతుకు తీవ్ర గాయాలు

శాంతిపురం, సెప్టెంబర్ 2 : కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలోని కనమలదొడి వద్ద సోమవారం మినీ టెంపో ఢీకొని ఓ రైతుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, రాళ్లబూదుగూరు పోలీ సుల కథనం మేరకు.. మండల పరిధిలోని చిన్నారిదొడ్డి పంచాయతీ కొత్తపేటకు చెందిన వెంకటేష్ టమోటాలతో కనమలదొడ్డి మార్కెట్‌కు వచ్చాడు. టమోటాలు అమ్మేసి ఇంటికి బయలుదేరాడు. కనమలదొడ్డి సర్కిల్లో రాళ్లబూదుగూరు రోడ్డులోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వి.కోట నుంచి ఎరువుల లోడుతో తమిళనాడులోని దిండిగల్‌కు వెళుతున్న మినీ టెంపో వేగంగా వెంకటేష్‌ను ఢీకొంది. అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు ఐడీ పార్టీ పోలీసులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు



ఎస్పీ నుంచి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకొంటున్న చిన్ని, ప్రకాష్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, అల్లావుద్దీన్, మనోహర్‌లు

పలమనేరు, సెప్టెంబరు2 : పలమనేరు సబ్‌డివిజన్ పరిధిలో ఐదు మండలాల్లో పనిచేస్తూ పలు కేసులను ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఐదుగురు ఐడీ పార్టీ పోలీసులకు సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. చిన్ని, ప్రకాష్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, అల్లావుద్దీన్, మనోహర్‌లకు డీజీపీ ఆదేశాల మేరకు చిత్తూరులో ఈ ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 2021-22 సంవత్సరాల్లో తమ విధినిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్‌బాషా, ఇలియాస్‌బాషా, ఆర్ఐ అడ్మిన్ సుధాకర్, ఆర్ఐ ఎంటీవో భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుమారుడి వైద్యంకోసం ఆర్థికసాయం



కుప్పం, సెప్టెంబరు 2: చంద్రబాబు గెలుపుకోసం ఎన్నికల్లో కష్టపడిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కోకిలమ్మ కుమారుడు విఘ్నేష్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కుప్పం నియోజకవర్గ టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్, సోమవారం కోకిలమ్మ ఇంటికి వెళ్లి ఆమె కుమారుడి వైద్యంకోసం రూ.7 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం



కంటి వ్యాధిగ్రస్తులను పలుకరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం రూరల్, సెప్టెంబరు 2: కుప్పం మండలం కంగుంది, నూలుకుంట జడ్పీ పాఠశాలల ఆవరణలో సోమవారం కంటి వెలుగు పథకం కింద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాలు జరిగాయి. పలువురు కంటి వ్యాధిగ్రస్తులు ఈ శిబిరాలకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో అవసరమైన వారిని కంటి శస్త్ర చికిత్సలకు వైద్య సిబ్బంది సిఫార్సు చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక్కరు కూడా కంటి సమస్యలతో బాధపడకూడదని ముఖ్య మంత్రి చంద్రబాబు ధ్యేయంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నూలుకుంటలో జరిగిన వైద్య శిబిరంలో తహసీల్దారు చిట్టిబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుభాష్‌రాజ్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ జశ్వంత్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో కావడి పండుగ



కావళ్లు సమర్పించేందుకు వస్తున్న భక్తులు

రామకుప్పం, సెప్టెంబరు 2: రామకుప్పం మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం ప్రజలు కావళ్ల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. 11 రోజుల పాటు ఉపవాసదీక్షతో ఉన్న పలువురు కావళ్లు ఎత్తుకున్నారు. పలువురు భక్తులు వీపునకు కొక్కేలు తగిలించుకుని వీపుతేర్లను లాగారు. మరికొందరు దవడలకు పొడవాటి శూలాలను గుచ్చుకున్నారు. వారంతా సాయంత్రం నుంచి రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి చేరుకుని, అక్కడ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

గణేశ్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ, ఆర్డీవో

కుప్పం, సెప్టెంబరు 2: కుప్పం సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడ గణేశ్ ఉత్సవాలు నిర్వహించు కోవా లన్నా రెవెన్యూ, పోలీస్, విద్యుత్తు శాఖ, అగ్నిమాపకశాఖ అనుమతులు తప్పనిసరిగా తీసు కోవాలని డీఎస్పీ పార్థసారథి, ఆర్డీవో శ్రీనివాసరాజు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమ వారం సాయం త్రం గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నారో ఆ స్థలానికి సంబంధించిన ఫొటోతోపాటు సంబంధిత ప్రాంతం ఫోటోను సైతం దరఖాస్తుతోపాటు జతపరచి, అనుమతులు పొందాలని సూచించారు. అలాకాకుండా ఇష్టారాజ్యంగా గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఉత్సవ ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎటు వంటి సంఘటనలు చోటుచేసుకున్నా ఉత్సవ కమిటీయే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, అగ్నిమాపకశాఖ, పోలీసుశాఖ, రెస్కో అధికారులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

విరూపాక్షమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం



కల్లూరు, సెప్టెంబర్ 2: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కొంగరవారిపల్లిలో గ్రామ దేవత విరూపాక్షమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గంగస్వీకరణ, కలశపూజ, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహప్రతిష్ఠ వేడుకలు కొనసాగుతున్నాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అంద జేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం నిర్వహించనున్న హోమాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

● రేపు గ్రామదేవత విగ్రహ ప్రతిష్ఠ

విగ్రహప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా మూడవ రోజు బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ తుది ఘట్టం వేడుకలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలియజేసింది.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

గుడుపల్లె, సెప్టెంబరు2: మండలంలోని కనమనపల్లె పెద్దచెరువులోని పేకాట స్థావరంపై పోలీ సులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు వారి నుంచి రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

రాష్ట్ర సంఘంలో పలమనేరు ఫైర్‌మెన్



ఎం.నరేష్‌ను సన్మానిస్తున్న అగ్నిమాపక కేంద్ర సిబ్బంది

పలమనేరు, సెప్టెంబరు2 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల సంఘం రాష్ట్ర సహకార్యదర్శిగా పలమనేరు అగ్నిమాపక కేంద్రంలో సీనియర్ లీడింగ్ ఫైర్ మెన్‌గా పనిచేస్తున్న ఎం.నరేష్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహించారు. బ్యాలెట్ విధానంలో జరిగిన ఈ ఎన్నికల్లో నరేష్ భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం పలమనేరు అగ్నిమాపక కేంద్రంలో ఎం.నరేష్‌ను సహ సిబ్బంది పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించండి

రామకుప్పం, సెప్టెంబరు 2: మండలంలోని అత్తికుప్పం గ్రామానికి చెందిన 104 వాహనంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలిపారు. అధికారులు న్యాయం చేయకుంటే విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

భవానిమారెమ్మ ఆలయంలో చోరీ



అమ్మవారి మాంగల్యాన్ని కట్‌చేసిన దుండగులు

రామకుప్పం, సెప్టెంబరు 2: రామకుప్పం మండలం గుట్టూరుతాండా గ్రామంలోని భవానిమారెమ్మ ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు.. గుట్టూరుతాండాలో మూడేళ్ల క్రితం భవానిమారెమ్మ ఆలయాన్ని నిర్మించారు. శుక్రవారం రాత్రి దుండగులు ఆలయ ప్రధాన గేటు, గర్భగుడి గేట్లను పగుల గొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారి మాంగల్యాన్ని తెంచి అందులోని రెండు తాళిబొట్లను, అమ్మవారి ముక్కుపుడకను తీసుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.72000. బీరువా లాకర్, హుండీలను పగులగొట్టి వాటిలోని సుమారు రూ.30వేలు దోచుకెళ్లారు. శనివారం భక్తులు గుర్తించారు. ఆదివారం స్థాని కులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

99.29 శాతం మందికి పెన్షన్ల పంపిణీ

పలమనేరు, సెప్టెంబరు2 : మున్సిపాలిటీలో సోమవారం సాయంత్రం వరకు 99.29 శాతం మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. 4640 మందికి గాను 4607 మందికి పెన్షన్లు అందజేశామని వివరించారు.

పరిష్కార వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచాలి



ప్రజల సమస్యలు వింటున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 2: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. ఏ ఫిర్యాదుపై ఎటువంటి పరిష్కారం చూపారో ఎప్పటికప్పుడు కడా వెబ్‌సైట్‌లో రిపోర్టు ఉంచాలని ఆదేశించారు. స్థానిక మండల సచివాలయంలో సోమవారం కడా పీడీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వ హించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి పీడీ వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్క ఫిర్యాదుదారు సమస్యను అడిగి తెలుసుకున్న పీడీ, ఆయా డిపార్టుమెంట్ల అధికారులకు ఫిర్యాదుల అర్జీలను ఇచ్చి పరిష్కరించాల్సిందిగా సూచించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ కడాకు ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ రూపొందించామని చెప్పారు. కడా పరిధిలోని నాలుగు మండలాలకు వివరాలు, ఇతర అంశాలు ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ప్రజల వినతులకు ఈ వెబ్‌సైట్‌లో స్థానం ఉందన్నారు. ప్రతిరోజూ కనీసం పావు గంటపాటు ప్రజల వినతుల పరిష్కారం కోసం తీసుకున్న చర్యల గురించి అధికారులు పరిశీలన జరపాలన్నారు. సమస్యలను ఆర్థిక, ఆర్థికేతరాలుగా విభజించి తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలకు ప్రాధాన్య మివ్వాలన్నారు. విజన్ డాక్యుమెంట్ తుది పరిశీలనలో ఉందని ఆ డాక్యుమెంట్ అమలులో ప్రతి ఒక్క అధికారీ భాగస్వాములై కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా చేసేందుకు తమవంతు బాధ్యత వహించాలని కడా పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రెస్కోలో వంద కోట్ల అవినీతి

● సెంథిల్ అరెస్టు ఆరంభం మాత్రమే ● టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 2: కుప్పం రెస్కోలో వైసీపీ హయాంలో వంద కోట్ల రూపాయల అవినీతి జరిగిందని చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ ఆరోపించారు. జరగలేదని గంగమ్మ ఆలయంలో, కాణిపాకంలో ప్రమాణం చేస్తారా అని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. రెస్కో మాజీ ఛైర్మన్ సెంథిల్ అరెస్టు ఆరంభం మాత్రమేనని, ముస్ముందు ఇంకా అవినీతి చర్యలు బయట పడుతాయని అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం రెస్కో మాజీ ఛైర్మన్ సెంథిల్ కుమార్ అరెస్టు నేపథ్యంలో టీడీపీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం నాడు ప్రతిపక్ష టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా జైళ్లపాలు చేసి రాక్షసానందం పొందిందన్నారు. జగన్ లాగా తప్పుడు కేసులు పెట్టి వేధించే సంస్కృతి చంద్రబాబుకు లేదన్నారు. రెస్కోలో వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరుగుతోందని అక్రమాలకు పాల్పడిన అందరిపైనా చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చ రించారు. టీడీపీ నాయకులు ప్రతాప్, ఏవీ.రవి, వైద్య శాంతారాం, విష్ణు, చంద్రశేఖర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకుల ఢీ.. మహిళ మృతి



మృతి చెందిన మహిళ

గుడుపల్లె, సెప్టెంబరు2: గుడుపల్లె మండలం బిజిగానిపల్లె క్రాస్ వద్ద సోమవారం రెండు బైకుల ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు...కర్ణాటక రాష్ట్రం బంగారు పేట తాలుక కామసముద్రం పంచాయతీ కొత్తిండ్లు గ్రామానికి చెందిన గోవిందరాజులు(31) తన బార్య వసంత(28)తో కలసి ద్విచక్ర వాహనంలో కుప్పం నుంచి తమ గ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలు దేరాడు. ఈ క్రమంలో బిజిగానిపల్లె గ్రామానికి చెందిన తిమ్మరాజు పొలం నుంచి తన గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గుడుపల్లె-కుప్పం మార్గం లోని బిజిగానిపల్లె క్రాస్ వద్ద రెండు బైకులు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వసంత అక్కడికక్కడే మృతిచెందింది. గోవిందరాజులు, తిమ్మరాజులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని కూడా తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాలేటమ్మకు విశేష పూజలు





చాందినీ బండి, ఆలయం వద్ద కిక్కిరిసిన జనం

సోమల, ఆగస్టు 2: మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మవారి ఆలయంలో సోమ వారం మలిజాతరకు భక్తులు భారీగా తలివచ్చారు. గొల్లపల్లె, బురుజుపల్లె, కమ్మపల్లె, నంజంపేట, ఎర్రనాగులపల్లె, దాదెం గొల్లపల్లె, కంచెంవారిపల్లె, తెట్టుపల్లె, ముండ్రివారిపల్లె వివిధ గ్రామాల నుంచి మొక్కుబడులతో చాందినీ బండ్లు మంగళ వాయిద్యాలు నడుమ, చెక్క భజనలు, కోలాటాలు నడుమ ఊరేగింపుగా సోమవారం ఉదయం 4గంటలకు చేరుకున్నాయి. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిం చారు. పలు గ్రామాల భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించారు. పలువురు భక్తులు అన్నదానాలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద పాగేటి ఉత్సవం, దోపు ఉత్సవాలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలను మాజీ సర్పంచు కొల్లా హరిప్రసాద్, సతీశ్, పాలేటి, గంగులప్ప, మంజునాథ్ తదితరులు పర్యవేక్షించారు.

వైఎస్‌కు ఘన నివాళి



పుంగనూరు వెఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప తదితరులు

పుంగనూరు రూరల్/ కల్లూరు/ వి.కోట/ బైరెడ్డిపల్లె/ పలమనేరు/సోమల/చౌడేపల్లె, సెప్టెంబరు2: దివంగత సీఎం వైఎస్ వర్ధంతి సదర్భంగా సోమవారం స్థానిక ప్రైవేటు బస్టాండ్‌లో ఆయన విగ్రహానికి మాజీ ఎంపీ రెడ్డెప్ప పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ● పులిచెర్ల మండలం కల్లూరులోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైసీపీ నాయకులు అంజలి ఘటించారు. ● వి.కోట ఎగువ చెక్‌పోస్టు కూడలిలోని వైఎస్ విగ్ర హానికి జడ్పీ ఛైర్మన్ శ్రీనిఆసులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ● బైరెడ్డి పల్లె ఎంపీడీవో కార్యాలయం వద్దనున్న వైఎస్ విగ్రహం వద్ద ఎంపీపీ రెడ్డెప్ప ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. జడ్పీటీసీ కేశవులు, వైసీపీ రాష్ట్రకార్యదర్శి కృష్ణ మూర్తి పాల్గొన్నారు. ● పలమనేరు మార్కెట్ కమిటీ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు మండీ సుధా, ఎస్‌కేఎస్ జాఫర్ నివాళుల ర్పించారు. ● సోమల బస్టాండ్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అమాస మోహన్, వీవీ రమణ, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు. ● చౌడేపల్లె బస్టాండులో ఉన్న వైస్ విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ దామోదర్ రాజు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, శెట్టిపేట సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల బస్టాండ్‌లో గుంతల పూడ్చివేత



రొంపిచెర్ల, ఆగస్టు2: రొంపిచెర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గుంతలకు మట్టితోలి ఎక్స్‌కవేటర్‌తో చదునుచేశారు. బస్టాండ్ పరిసరాల్లో చెత్తాచెదారం తొలగించారు. జనసేన మండల కన్వీనర్ రెడ్డిశేఖర్ రాయల్ తమ నాయకులు, కార్యకర్తలతో కలిసి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా గుంతలు పూడ్చించారు.

గొర్రెల్లో పిల్లిముసర వ్యాధి నివారణకు టీకాలు



మాట్లాడుతున్న పశువైద్యాధికారి శ్రీధర్

రొంపిచెర్ల, సెప్టెంబరు2: మండలంలోని 24,600 గొర్రెలకు పిల్లిముసర వ్యాధి నివారణ టీకాలు ఈ నెల 1 నుంచి 30 వరకు వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టరు శ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక పశువైద్య కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పశువుల సంరక్షణకు ప్రభుత్వ అందించే పశుపోషణ పథకాలు సద్వినియోగం చేసుకో వాలన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, పెయ్య దూడలకు బ్రూసెల్లా టీకాలు, గొర్రెలకు నట్టల నివారణ మందు ఇంటింటికీ వెళ్లి వేస్తా మన్నారు. అలాగే 15వ తేదీ నుంచి డిసెంబరు 30 వరకు పశుగణన చేపడుతామని వివరించారు. మండలానికి 50 గోకులాల టార్గెట్ ఇచ్చారని అయితే 74 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలియజేశారు.

దేశంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ



విలేకరులతో మాట్లాడుతున్న సాయి లోకేష్

చౌడేపల్లె, సెప్టెంబర్2: దేశంలో 20 కోట్ల మంది సభ్యత్వాలు ఉన్న అతి పెద్ద పార్టీ బీజేపీయేనని ఆ పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయి లోకేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర యువ కాపునాడు నాయకులు సాయికృష్ణ ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 4 నుంచి బీజేపీ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాయలసీమ ఇన్‌చార్జి కిరణ్, కడియాల మనోహర్, ప్రవీణ్, నారబాల కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు





పుంగనూరులో కేక్‌కట్ చేస్తున్న ఎన్డీయే కూటమి నాయకులు ● కుప్పంలో కేక్ కట్ చేస్తున్న నరేశ్ తదితరులు

పుంగనూరు, సెప్టెంబరు2: డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను పుంగనూరులో ఎన్డీయే కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, టీడీపీ నాయకులు శమీపతి, బీజేపీ నాయకురాలు మల్లికారాణి, జనసేన నాయకులు నరేశ్‌రాయల్, చైతన్యరాయల్ పాల్గొన్నారు. ● మండలంలోని సుగాలిమిట్టలో జనసేన నాయకుడు బాలాజీ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు. మోదుగులపల్లె, భీమగానిపల్లె, పాళ్యంపల్లె, సింగిరిగుంట గ్రామ పంచాయతీల్లో జనసేన నాయకులు కేక్‌కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు.

పలమనేరు: పలమనేరులో జనసేన, పవన్ అభిమానులు మోటర్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య, కిరణ్, మోహన్, దిలీప్, అమ్ములు, జన తదితరులు పాల్గొన్నారు.

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ 2వ వార్డు శీగలపల్లెలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు పాల్గొన్నారు. జనసేన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

రొంపిచెర్ల: రొంపిచెర్లలో జనసేన మండల అధ్యక్షుడు శేఖర్ రాయల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సోమల: పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, పొదలగుంట్లపల్లె, నడింపల్లెలో జనసేన పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. సోమల బస్టాండ్, కందూరు బస్టాండ్‌ల్లో 56కిలోల కేక్‌ను కట్‌చేసి పంచారు. అన్నదానాలు చేశారు. జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం రాయల్, బీజేపీ పుంగనూరు నియోజక వర్గం ఇన్‌చార్జి మదన్‌మోహన్ బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం మంగళంపేట మంగళంపేటలో జన సైనికుల ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. కల్లూరు జడ్పీ బంగళా ఆవరణలో కేక్ కట్ చేశారు. పుంగనూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చిన్నారాయల్, నియోజకవర్గం జనసేన పార్టీ గౌరవాధ్యక్షులు పోకల జనార్ధన్, జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి హేమంత్‌రాయల్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు చంద్రబాబు పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక బస్టాండులో బీజేపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయిలోకేష్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల రమణ, కిసాన్‌మోర్చ రాయలసీమ ఇన్‌చార్జి కిరణ్‌లు అన్నదానం నిర్వహించారు. జనసేన నాయకులు చిన్నరాయల్, హెమంత్, పరమేశం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పవన్ అభిమానులు 30 మంది స్థానిక పీహెచ్‌సీలో రక్తదానం చేశారు. ఏ.కొత్తకోటలో ఎమ్మార్పీఎస్ నాయకులు హరి ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

రామకుప్పం: స్థానిక బందార్లపల్లె క్రాస్ సర్కిల్లో జనసేన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆటోస్టాండు సర్కిల్లో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నరేష్, మండల అధ్యక్షుడు హరీష్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహులు కేక్ కట్‌చేశారు. అన్నదానం చేశారు. యానాదికాలనీలో దుస్తులు పంపిణీ చేశారు.

గుడుపల్లె: రైల్వే క్రాస్‌లోని వినాయక స్వామి ఆలయంలో పవన్‌కల్యాణ్ పేరిట పూజలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ బ్యానర్‌కు పాలాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షులు అమీర్ కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. మొక్కలు నాటారు. తహసీల్దారు సీతారామ్, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త నరేష్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శివశంకర్, మండల బీజేపీ అధ్యక్షులు రామచంద్ర, పాల్గొన్నారు.

వి.కోట: ఎన్టీఆర్ కూడలిలో జనసేన నేతలు కేక్ కత్తిరించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంచిపెట్టారు. ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు బాబు, రెడ్డి భాస్కర్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో జనసేన నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేశారు.

సకాలంలో ప్రజా సమస్యల పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న ఏసీ ప్రసాద్

చిత్తూరు, సెప్టెంబరు 2: ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని సహాయ కమిషనర్ అవినేతి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరించారు. టిడ్కోకు రెండు, మెప్మాకు ఒకటి వచ్చాయి. క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. ఎంహెచ్‌వో అనిల్‌నాయక్, ఎంఈ గోమతి పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరస్వామికి పాలాభిషేకం


స్వామికి అర్చన చేయిస్తున్న భక్తులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 2: డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం పాలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఎగువ కన్నికాపురం సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేకం, రుద్రాభి షేకం చేశారు. చవటగుంట గ్రామంలోని ఆవుదేవర నందీశ్వరుడికి రుద్రాభిషేకం జరిపించారు.

పోషకాహారం తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న సీడీపీవో పద్మసునంద

వెదురుకుప్పం, సెప్టెంబరు 2: పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని కార్వేటి నగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పద్మసునంద సూచించారు. సోమవారం కార్వేటి నగరంలోని అంగన్వాడీ కేంద్రంలో 'పోషణ్ మా' కార్యక్రమంలో భాగంగా పిల్లల తల్లులకు పోషకాహారం లోపిస్తే కలిగే అనర్థాలను వివరించారు. ముర్రుపాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, సెప్టెంబరు 2: పట్టు పురుగుల పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మండలంలోని పాపసముద్రంలో సోమవారం ఆయన రైతులకు సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. కందులు, ఉలవలతో పాటు పట్టుగూళ్ల పెంపకం చేపడితే ఆర్థికంగా ఎదుగుతారన్నారు. వ్యవసాయాధికారిణి మాధవి, తులసిరెడ్డి, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సుమతి

గుడిపాల, సెప్టెంబరు 2: మండలంలో ప్రభుత్వ భూములు చాలా వరకు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని కాపాడాలని మాజీ జడ్పీటీసీ సుమతి కోరారు. సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చెరువులు, కుంటలు, మేత భూములను సైతం ఆక్రమించుకున్నారని తెలిపారు. సంఘమిత్ర పుష్ప పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్‌తో కల్పజ

చిత్తూరు, సెప్టెంబరు 2: చిత్తూరు మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవులు కుమార్తె డీఏ కల్పజ బెంగళూరు నార్త్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. విద్య, వైద్య రంగాల్లో ఆమె చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రకటించారు. సోమవారం కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కుముద, వైస్ చాన్సలర్ నిరంజన చేతుల మీదుగా ఆమె అందుకున్నారు.

ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులకు నోటీసులు

పాలసముద్రం, సెప్టెంబరు 2: గత ప్రభుత్వంలో మంజూరై ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులకు సోమవారం నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. వారం రోజులోగా పనులు ప్రారంభించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. నిర్మాణాలు చేపట్టకపోతే ప్రభుత్వం బిల్లులు చెల్లించదని వివరించారు.

నగరిలో గంజాయిని నిర్మూలించండి

నగరి, సెప్టెంబరు 2 : నగరిలో గంజాయి విక్రయాలను నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్నేషనల్ హ్యూమానిటీ అండ్ మీడియా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎస్.సలీమ్ నగరి సీఐ మహేశ్వర్‌ను కోరారు. సోమవారం సీఐను శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందించారు. గంజాయికి అలవాటుపడి యువత పెడదోవ పడుతోందని తెలిపారు.

డీసీహెచ్‌ఎస్ ఆకస్మిక తనిఖీలు


రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్

పెనుమూరు, సెప్టెంబరు 2: పెనుమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్) రాజశేఖరరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై స్పందించిన ఆయన రికార్డులను పరిశీలించారు. రాత్రిపూట డాక్టర్లకు డ్యూటీలు వేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గీతారాణికి సూచించారు. ప్రతిరోజూ ఏ డాక్టర్లు అందుబాటులో ఉంటారో రోస్టర్‌లో పొందుపరచాలని సూచించారు. అనంతరం రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సదుపాయాలపై ఆరా తీశారు.

అపుస్మా జిల్లా కార్యవర్గం

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 2: ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. విజయం సీబీఎస్ఈ స్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సీఆర్ మహేష్, ఎం.కృష్ణ, కోశాధికారిగా లక్ష్మీ ప్రసాద్, ఎం.తేజోమూర్తి, ఉపాధ్యక్షులుగా ఎస్ఎస్‌కే రాజా, చీఫ్ మెంబర్‌గా సురేంద్రరాజు, రమేష్, ధనంజయ, అడ్వైజర్‌గా ప్రభాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రంగనాథ్, మోహన్‌రెడ్డి, వెంకటాద్రి, ఈసీ మెంబర్లుగా జయచంద్రారెడ్డి, గిరిధర్ మూర్తి, పార్థసారథి ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం నేతలు అభినందించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వైభవంగా ఊంజల్ సేవ



చిత్తూరు కల్చరల్,సెప్టెంబరు 2: 75 దొడ్డిపల్లె అంకాల పరమేశ్వరి అమ్మవారికి శ్రావణమాస అమావాస్య సందర్భంగా సోమవారం సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. పాలకమండలి ఛైర్మన్ గోపాలకృష్ణన్ భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు పసుపు కుంకుమ అందజేశారు.

స్వచ్ఛతా పక్వాడా ర్యాలీ



వెదురుకుప్పం, సెప్టెంబరు 2: కార్వేటినగరంలో సోమవారం కేవీఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రత, ఆహారం-ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఉద్యోగులు, మహిళలు హాజరయ్యారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సురేఖ

వెదురుకుప్పం, సెప్టెంబరు 2: తిరుమలయ్యపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. టీడీపీ బీసీ దాసరి సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కోలా జయచంద్ర ఆధ్వర్యంలో జరిగిన మెడికల్ క్యాంపునకు వివిధ ప్రాంతాల నుంచి రోగులు తరలి వచ్చారు. మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో వైద్య బృందం పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.

జనసేన ఫ్లెక్సీ చించివేత



పూతలపట్టు, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. పవన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ పి.కొత్తకోటలో కూటమి వారి పల్లె గ్రామానికి చెందిన జయప్రకాష్, మునిరాజులు భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని చించి, నిప్పు అంటించారు. పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు.

పవన్‌కు ఎంపీ శుభాకాంక్షలు



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 2: పవన్ కల్యాణ్‌కు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, రిటైర్డ్ ఎస్పీ, టీడీపీ నేత పి. చిన్నస్వామి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం పవన్‌ను కలిసి శాలువలు కప్పి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

వరద సహాయక చర్యలకు విద్యుత్ సిబ్బంది

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 2: విజయవాడలో వరదల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ కోసం చిత్తూరు ఆపరేషన్ డివిజన్ నుంచి 16 మంది సిబ్బంది సోమవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. విద్యుత్ శాఖ ఈఈ మునిచంద్ర జెండా ఊపి ఆ వాహనాలను సాగనంపారు. అక్కడ విద్యుత్ పునరుద్ధరణ అయ్యే వరకు సేవలు అందిస్తారన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 2: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగు హాలులో పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశమయ్యారు. పరిశ్రమల యాజమాన్యాలు ప్రామాణిక నిర్వహణ పద్ధతులు పాటించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులు ఆహ్వానిస్తామని, అదే సమయంలో భద్రతా ప్రమాణాల విషయంలో కఠినంగా ఉంటామని అన్నారు. సిబ్బంది భద్రతకు చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు నెలలకోసారి ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహిస్తామన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు సేఫ్టీ ఆడిట్ విధిగా నిర్వహించి, ఆ వివరాలను పరిశ్రమల ప్రాంగణంలో ప్రదర్శించాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జారీ చేసే మార్గదర్శకాలను ప్రతి పరిశ్రమా పాటించాలన్నారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ పరిశ్రమల ప్రాంగణంలో ప్రమాదాల నియంత్రణకు అవసరమైన పరికరాలు, మేనేజ్‌మెంట్ సిస్టమ్ సెక్యూరిటీ ప్లాన్ సిద్ధంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, డీఐసీ జీఎం చంద్రశేఖర్, డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఓంకార్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు, సెప్టెంబరు 2: పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం ఇరువారం పీహెచ్‌కాలనీలోని న్యాక్ కార్యాలయంలో తాపీ మేస్త్రీ, కార్పెంటర్ పనులపై ఏర్పా టు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాలతో కలిసి ఆయన పాల్గొన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద 18 రకాల చేతివృత్తుల వారికి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే రుణసౌకర్యం కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవారిని లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్, ఎల్‌డీఎం హరీష్ పాల్గొన్నారు.

10 నుంచి 'పొలం పిలుస్తోంది'


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 2: జిల్లాలో ఈనెల 10వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం నూతన సమావేశపు మందిరంలో వాల్‌పోస్టర్లను జేసీ విద్యాధరితో కలిసి ఆవిష్కరించారు. మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, శోభారాణి, ప్రభాకర్, బాలసుబ్రహ్మణ్యం, ఎల్‌డీఎం హరీష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు బ్రహ్మోత్సవాల ఆహ్వానం


కలెక్టర్‌కు పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 2: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఎస్పీ మణికంఠ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో గురుప్రసాద్ ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఈవో విద్యాసాగర్‌రెడ్డి వారి వెంట ఉన్నారు.

పీవీకేఎన్‌లో ఘనంగా ఫ్రెషర్స్‌డే

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 2: పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి ఆధ్వర్యంలో సోమవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. కొత్తగా కళాశాలలోకి వచ్చిన విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. అకడమిక్ అంశంపై పలు సూచనలు చేశారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 2: కాణిపాకంలో ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను అడిషినల్ ఎస్పీ నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. క్యూలు, పార్కింగ్ ప్రదేశం, బస్టాండ్, సీసీ కెమెరాలు, కంట్రోల్ రూమ్, అన్నదాన సత్రాన్ని పరిశీలించారు. అధికారులకు, పోలీసులకు పలు సూచనలు చేశారు. డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఈఈ వెంకటనారాయణ, ఎస్‌ఐ ధరణీధర్, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.


మాజీ మంత్రి చెంగారెడ్డిని నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ రేణిగుంట విమానాశ్రయంలో కలిశారు. అమరావతి నుంచి వచ్చిన భానుకు చెంగారెడ్డి ఎదురుపడడంతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు2: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను నగరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జనసేన సీనియర్ నేత ఆరణి శివకుమార్ ఆధ్వర్యంలో దొడ్డిపల్లెలోని కన్నికలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. అన్నదానం చేశారు. 47వ డివిజన్‌లో ఇన్చార్జ్ వీరం వినోద్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి, మొక్కలు నాటారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పాల్గొన్నారు. 6వ డివిజన్‌లో మొక్కలు నాటారు. తపోవనంలో వృద్ధులకు అన్నదానం చేశారు.

గుడిపాల : 197 రామాపురంలో జనసేన నాయకుడు సింధు రాయల్, టీడీపీ మాజీ మండల ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. గుడిపాలలో పార్టీ మండలాధ్యక్షుడు రూప్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు.

బంగారుపాళ్యం : జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ మండలా ధ్యక్షుడు కోడి చంద్రయ్య కేక్ కట్ చేశారు. సంక్రాంతిపల్లె పంచాయతీలోని మిట్టపల్లెలో వైసీపీకి చెందిన నాగరాజు, అతని అనుచరులు 20 మంది జనసేన పార్టీలో చేరారు. బలిజపల్లెలో ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండలా ధ్యక్షుడు జయప్రకాష్ పాల్గొని ఇరు పార్టీల జెండాలను ఆవిష్కరించి, అన్నదానం చేశారు. మొక్కలు నాటారు.

తవణంపల్లె : తవణంపల్లెలోని టి.పుత్తూరు కూడలి వద్ద కేక్ కట్ చేసి, పంచి పెట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

పాలసముద్రం : పాలసముద్రం ప్రభుత్వ బాలికల హాస్టల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు పంచి పెట్టారు.

విజయపురం : పన్నూరు, కళియంబాకం, బూచివాతనత్తం, ఆలపాకం, జగన్నాథపురం, మల్లారెడ్డి కండ్రిగ పంచాయతీల్లో జనసేన జిల్లా కార్యదర్శి స్వామినాథన్ కేక్ కట్ చేశారు. పన్నూరులో భవన నిర్మాణ కార్మికులకు, వృద్ధులకు అన్నదానం చేశారు. పలు కార్యాలయాల్లో స్వీట్లు పంపిణీ చేశారు.

పెనుమూరు : బస్టాండులో జనసేన మండలాధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కేక్ కట్ చేశారు.

ఎస్‌ఆర్‌పురం : మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కేక్ కట్ చేశారు.

పూతలపట్టు : కూటమివారిపల్లెలో రక్తదానం చేశారు. పి.కొత్తకోట, పూతలపట్టు, చిన్న బండపల్లె, ఎం.బండపల్లె, ఎస్వీసెట్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే మురళీమోహన్ కేక్ కట్ చేసి, అభిమానులకు పంచిపెట్టారు.

వెదురుకుప్పం : వెదురుకుప్పం మండలం మాంబేడులో జనసేన మండల నాయకుడు మురళి ఆధ్వర్యంలో జనసేన జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. కార్వేటినగరంలో కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు.

నగరి : నగరి టవర్ క్లాక్ వద్ద జనసేన నేతలు కోమల, మెరుపుల మహేష్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. అన్నదానం చేశారు.

గంగాధరనెల్లూరు : ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి యుగం ధర్, టీడీపీ మండలాధ్యక్షుడు స్వామిదాస్, జనసేన మండలాధ్యక్షుడు సురేష్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు మురళి, టీఎన్‌ఎస్‌ఎఫ్ నేత లోకేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఐరాల : కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో పవన్ అభిమానులు స్వామికి అభిషేకం నిర్వహించి, ఆలయం వెలుపల 1,116 కొబ్బరికాయలు కొట్టారు. ఐరాల, దివిటివారిపల్లె, శ్రీరామతీర్థ సేవాశ్రమంలో వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంచారు. ఐరాలలో అన్నదానం చేశారు.

చిత్తూరు రూరల్ : ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అన్నదానం చేశారు. చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరు గ్రామంలో కేక్ కట్ చేశారు. నిరుపేద కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తుమ్మింద గ్రామంలో కేక్ కట్ చేశారు. మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత పాల్గొన్నారు.


జనసేన కార్యాలయంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గురజాల


ఎస్‌ఆర్‌పురం మండలంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే థామస్


ఐరాలలో అన్నదానం చేస్తున్న జనసేన నేతలు


బలిజపల్లె వేడుకల్లో ఎమ్మెల్యే మురళీ మోహన్

వైఎస్సార్‌కు ఘన నివాళి


నగరిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రోజా

చిత్తూరు, సెప్టెంబరు 2: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. డీసీసీబీ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. చుడా మాజీ ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నేతలు గాయత్రిదేవి, జ్ఞాన జగదీశ్, రాసనపల్లె ప్రకాష్, ఐనేరి శివారెడ్డి, అల్తాఫ్, ఆను పాల్గొన్నారు.

వెదురుకుప్పం : వెదురుకుప్పంలో వైఎస్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు(డీసీసీ) పోటుగారి భాస్కర్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.జయచంద్ర, మండల ఉపాధ్యక్షుడు దాసురెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సర్పంచ్ పోటుగారి లలిత పాల్గొన్నారు. దేవళంపేటలో బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య, ఎంపీటీసీ కొత్తపల్లి భాస్కర్, మాజీ ఎంపీపీ మేలిపాటి పురుషోత్తం, రైతు సమాఖ్య అధ్యక్షుడు పెద్దిరెడ్డిగారి ఉమాచంద్రారెడ్డి ఆధ్వర్యం లో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్వేటినగరంలో వైఎస్ విగ్రహానికి వైసీపీ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించాయి.


వెదురుకుప్పంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

తవణంపల్లె : అరగొండ కొత్త బస్టాండ్‌లో గల వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూజలు చేసి, మాలలు వేసి నివాళులర్పించారు.

విజయపురం : మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్, మాధవరం, విజయపురం కూడలి, పాతార్కాడులో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైసీపీ మండలాధ్యక్షుడు గోపి, ఆర్బీకే ఛైర్మన్ గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మంజు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నగరి : నగరి ఓంశక్తి ఆలయం వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి మాజీ మంత్రి ఆర్కే రోజా పూలమాల వేసి, నివాళులర్పించారు. నిరుపేదల పాలిట ఆశాజ్యోతి వైఎస్సార్ అని కొనియాడారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు : గంగాధరనెల్లూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. బెంగళూరుకు చెందిన విజన్ ఫ్యాషన్స్ ఎండీ మడవనేరి సురేష్‌రెడ్డి పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచులు మునిరాజారెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రేషన్ షాపులపై రాజకీయాలొద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

యాదమరి, సెప్టెంబరు 2: రాజకీయ కక్షతో రేషన్ డీలర్‌ను మార్చారంటూ సోమవారం తహసీల్దార్ పార్థసారథికి జన్నాలమిట్ట, వెంకటాపురం గ్రామాల ప్రజలు వినతిపత్రాలు ఇచ్చారు. సజావుగా సాగుతున్న రేషన్ దుకాణాన్ని కొందరు స్వార్థంతో మెజారిటీ లబ్ధిదారులకు ఆమోదయోగ్యం కాని వ్యక్తికి అప్పగించారని ఫిర్యాదు చేశారు. పైగా గ్రామాల్లో విభేదాలు సృష్టించారని తెలిపారు. వెంటనే డీలర్‌ను మార్చాలని డిమాండ్ చేశారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం

నగరి, ఆగస్టు 2: వరద బాధితులకు ఆపన్నహస్తం అందించాలని టీఎస్‌టీ యూసీ చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి జ్యోతినాయుడు కోరారు. విజయవాడను వరదలు ముంచెత్తడంతో చాలామంది నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.